RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | శుక్రవారం 3-7-2026 | సంచిక: 13 | సంఖ్య: 277 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి



## బోడుప్పల్‌లో ఉద్రిక్తత.. కల్వకుంట్ల కవిత అరెస్ట్

తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని ఆరోపణ

కవితతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



## ఏపీకి నేను మేనమామను...

మేనమామ ఎప్పుడూ ఉత్త చేతులతో రాడు

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

చంద్రబాబు, పవన్‌తో కలిసి వీబీ జీ రామ్ జీ పథకాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి

రాష్ట్రానికి 74,212 పక్కా ఇళ్లు, రోడ్లకు రూ.422 కోట్లు ప్రకటించిన చౌహాన్

వీబీ జీ రామ్ జీ కింద ఏపీకి 9 నెలల్లో రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని హామీ

మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద తోతాపురి మామిడి కొనుగోలుకు అంగీకారం

## గురుకుల టెండర్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వం

వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది: బండి సంజయ్

బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను మార్గమధ్యంలో అడ్డుకున్న పోలీసులు

ఇదంతా బిగ్ బాస్ షో అంటూ బీజేపీ నేత బండి సంజయ్ విమర్శ





## ‘తల్లికి వందనం’ రెండో విడత తేదీలు ఖరారు

జులై 16 నుంచి 18 మధ్య తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్న మంత్రి లోకేశ్

150 రోజుల్లో 16,000 టీచర్, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని వెల్లడి

ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న లోకేశ్

ప్రభుత్వ విజయాలపై జులై 15 నుంచి ఇంటింటి ప్రచారం చేయాలని పిలుపు

# గుండ్లపోచంపల్లిలో అక్రమ నిర్మాణాలు జోరు..

## టౌన్ ప్లానింగ్ వైఫల్యంపై విమర్శలు





**మేడ్చల్ (నేటి ప్రస్థానం ):**
“వడ్డించేవాడు మనవాడైతే.. బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే” అనే సామెత మేడ్చల్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారుల పనితీరుకు అచ్చొచ్చినట్టుగా ఉందనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. గుండ్లపోచంపల్లి డివిజన్-299 పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒక రూపంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.



## తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్..

పోలీసుల అదుపులో హరీశ్ రావు

గన్‌పార్క్‌కు వెళ్తుండగా తెలంగాణ భవన్ వద్ద హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు

బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత

కారు దిగి నడుచుకుంటూ వెళ్లే ప్రయత్నం చేసిన హరీశ్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు

గురుకులాల అవినీతి, రాష్ట్ర అప్పులపై చర్చకు మంత్రులు సవాల్

చర్చ నుంచి పారిపోవద్దని మంత్రులకు హరీశ్‌రావు ప్రతిసవాల్



## చమురు ధరల ఊరట..

భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

తగ్గిన ముడి చమురు ధరలతో పెరిగిన సెంటిమెంట్

## చికెన్, గుడ్ల ధరలకు రెక్కలు..

సామాన్యుడి జేబుకు చిల్లు!

ఒక్కసారిగా పెరిగిన చికెన్, కోడి గుడ్ల ధరలు

హైదరాబాద్, విజయవాడలో కిలో చికెన్ రూ.330

ఒక్క గుడ్డు ధర రూ.8కు చేరగా, ట్రే రూ.240

ఎండలు, దాణా ధరల పెరుగుదలతో తగ్గిన ఉత్పత్తి

డిమాండ్ పెరగడంతో మరింత ఎగబాకుతున్న ధరలు





## సవాల్ చేసి వెనక్కి తగ్గారు..

చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్

చర్చకు సవాల్ చేసిన కాంగ్రెస్ నేతలే వెనక్కి తగ్గారని కేటీఆర్ విమర్శ

హరీశ్‌రావు అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్

అప్పులు, గురుకులాల అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్

తన లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తానన్న మంత్రి జూపల్లి

రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్

## ఏసీబీ వలలో అవినీతి అధికారి..

డీఎస్పీ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు, బంగారం!

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో డీఎస్పీ భీంరెడ్డి అరెస్ట్

తెలంగాణ, కర్ణాటకలో పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ దాడులు

విల్లాలు, ఫ్లాట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, 45 ఎకరాల భూములు గుర్తింపు

రూ.43 లక్షల నగదు, 2 కిలోల బంగారం, 20 కిలోల వెండి స్వాధీనం



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# గుండ్లపోచంపల్లిలో అక్రమ నిర్మాణాలు జోరు..

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది బిల్డర్లు జీం2 అంతస్తులకు మాత్రమే అనుమతులు పొందినా, నిబంధనలను ఉల్లంఘిస్తూ జీం5 లేదా జీం6 అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు నివాస భవనాల పేరుతో అనుమతులు తీసుకుని, వాటిని వాణిజ్య అవసరాలకు అనుగుణంగా నిర్మిస్తున్నారని కూడా స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే, నాలా కన్వర్షన్ చేయకుండా వ్యవసాయ భూముల్లోనే నిర్మాణాలు కొనసాగుతున్న ఘటనలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. ఈ తరహా అక్రమాల వల్ల పట్టణ ప్రణాళిక నిబంధనలు ఉల్లంఘించబడటంతో పాటు, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండిపడుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయ నష్టం?

అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన పలు రకాల ఆదాయం కోల్పోయే పరిస్థితి నెలకొంటోందని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా---డెవలప్‌మెంట్ ఛార్జీలు ఇంపాక్ట్ ఫీజులు అదనపు నిర్మాణాల రెగ్యులరైజేషన్ ఫీజులుఆస్తి పన్నువంటి రూపాల్లో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.అంతేకాకుండా భవిష్యత్తులో రహదారులు, డ్రైనేజీ, పార్కింగ్, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతులపై కూడా తీవ్ర ఒత్తిడి ఏర్పడే ప్రమాదం ఉందని పట్టణాభివృద్ధి నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### టౌన్ ప్లానింగ్ విభాగం ఎక్కడ?

గుండ్లపోచంపల్లి డివిజన్‌లో అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో టౌన్ ప్లానింగ్ విభాగం సమర్థవంతంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతులు పొందిన ప్లాన్లకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. పత్రాలపై ఒక విధంగా అనుమతులు తీసుకుని, క్షేత్రస్థాయిలో మరో విధంగా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల వాదన ప్రకారం, గుండ్లపోచంపల్లి ప్రాంతంలో కొంతకాలంగా పూర్తి స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం కూడా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. అక్రమ నిర్మాణాలపై అధికారులు నోటీసులు జారీ చేయడానికే పరిమితమవుతున్నారని, కూల్చివేతలు లేదా కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో, గుండ్లపోచంపల్లి పరిధిలో నమోదవుతున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. అధికారుల స్పందన వెలువడాల్సి ఉంది.



# చమురు ధరల ఊరట..

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య వాణిజ్య చర్చల్లో సానుకూల సంకేతాలు వెలువడటంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం మన మార్కెట్లకు కలిసొచ్చింది. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడి కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఫలితంగా, సెన్సెక్స్ 579.48 పాయింట్లు లాభపడి 77,502.12 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 169.85 పాయింట్లు పెరిగి 24,175.70 వద్ద ముగిసింది.ఈనాటి ర్యాలీలో టెక్నాలజీ షేర్లు కీలక పాత్ర పోషించాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ వంటి షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్లుగా నిలిచాయి. దీంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2025 మే నెల తర్వాత ఒకే రోజులో అతిపెద్ద లాభాన్ని నమోదు చేసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.48 శాతం, స్మాల్‌క్యాప్ 1.25 శాతం మేర లాభపడ్డాయి. ఐటీతో పాటు ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ రంగాల సూచీలు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి.టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ రోజంతా స్థిరమైన కొనుగోళ్లతో 24,200 నిరోధక స్థాయి వైపు కదిలిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# 'తల్లికి వందనం' రెండో విడత తేదీలు ఖరారు

'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధులను జులై 16 నుంచి 18వ తేదీల మధ్య తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్–టీచర్ మీటింగ్‌లు (పీటీఎం) నిర్వహించే సమయంలోనే ఈ నిధులను విడుదల చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రేణిగుంట మండలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 150 రోజుల వ్యవధిలోనే 16,000 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది మరో 10,000 పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జులై 15 నుంచి 'ఇంటింటి ప్రచారం' చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా, ప్రతిపక్ష పార్టీల వైఖరిని ప్రస్తావిస్తూ.. కార్యకర్తలు చెడు లక్షణాలను అలవర్చుకోవద్దని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా లోకేశ్ పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతో పాటు, పలువురు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# చికెన్, గుడ్ల ధరలకు రెక్కలు..

ఒకప్పుడు సామాన్యుడికి అందుబాటులో ఉన్న చికెన్, కోడిగుడ్లు ఇప్పుడు జేబుకు భారంగా మారుతున్నాయి. గత కొన్ని వారాల్లోనే వీటి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాలు, నాన్‌వెజ్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వారాంతంలో చికెన్ కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.తెలుగు రాష్ట్రాల్లో గత వారం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.280 నుంచి రూ.300 మధ్య విక్రయించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.330 వరకు పలుకుతోంది. విజయవాడలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ కూడా కిలో చికెన్ రూ.320 నుంచి రూ.330 వరకు అమ్ముతున్నారు. కొన్ని రిటైల్ దుకాణాల్లో ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు.చికెన్‌తో పాటు కోడిగుడ్ల ధరలు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం రూ.6 నుంచి రూ.7 మధ్య ఉన్న ఒక్క గుడ్డు ధర ప్రస్తుతం రూ.8కు చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే కొనాలంటే దాదాపు రూ.240 ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రొటీన్ కోసం గుడ్లపై ఆధారపడే కుటుంబాలకు ఇది అదనపు భారంగా మారింది.ఈ ధరల పెరుగుదలకు పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఎండల తీవ్రతతో పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల మరణాలు పెరగడం వల్ల ఉత్పత్తి తగ్గింది. మరోవైపు మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ వ్యయం కూడా పెరిగింది. దీంతో చాలామంది రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించినట్లు వ్యాపారులు చెబుతున్నారు.పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నుంచి డిమాండ్ భారీగా పెరిగింది. సరఫరా తగ్గి, డిమాండ్ పెరగడంతో ధరలు మరింత ఎగబాకుతున్నాయి.

# బోడుప్పల్‌లో ఉద్రిక్తత.. కల్వకుంట్ల కవిత అరెస్ట్

తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ శివారులోని బోడుప్పల్‌లో గురువారం ఆమె నిరసన కార్యక్రమం నిర్వహిస్తుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. కవితతో పాటు పలువురు తెలంగాణ జాగృతి నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం లేదని కవిత ఆరోపించారు. ఉప్పల్ భగాయత్ వంటి ప్రాంతాల్లో ఉద్యమకారులకు భూములు కేటాయించడంలో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆమె విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆమె ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు.ఆందోళన సందర్భంగా పోలీసులు, నిరసనకారుల మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. అనంతరం కవితను, ఇతర నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్టుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్..





గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పుల అంశాలపై చర్చించేందుకు గన్‌పార్క్‌కు బయల్దేరిన బీఆర్ఎస్ నేత హరీశ్‌రావును తెలంగాణ భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదని ముందుకు వెళ్లనివ్వలేదు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చర్చకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. వాహనాన్ని నిలిపివేయడంతో హరీశ్‌రావు కాలినడకన గన్‌పార్క్‌కు వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ తొక్కిసలాటలో హరీశ్‌రావు కిందపడిపోయారు. అనంతరం పోలీసులు ఆయన్ను, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. తమ నేతను అడ్డుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్.. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు సవాల్ విసిరారు. గన్‌పార్క్ వద్ద తాము సిద్ధంగా ఉంటామని ప్రకటించారు. దీన్ని స్వీకరించిన హరీశ్‌రావు, తామే అక్కడికి వస్తున్నామని చెప్పారు. చర్చ నుంచి పారిపోవద్దని మంత్రులకు సవాల్ విసురుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే అనుమతి లేకపోవడంతో పోలీసులు ఆయన్ను గన్‌పార్క్‌కు వెళ్లనీయకుండా అదుపులోకి తీసుకున్నారు.

# ఏసీబీ వలలో అవినీతి అధికారి..

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ పోలీస్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సంకిరెడ్డి భీంరెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం హైదరాబాద్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ పర్యవేక్షణలో సుమారు 20 బృందాలు ఈ దాడులలో పాల్గొన్నాయి. హైదరాబాద్ శివారు నార్సింగిలోని 'వెస్సెల్లా మీడోస్'లో ఉన్న భీంరెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో విల్లాలు, పెంట్‌హౌస్‌లు, ఫ్లాట్లు, వాణిజ్య సముదాయాలు, ఖాళీ ప్లాట్లు మరియు వ్యవసాయ భూములకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల సందర్భంగా రూ. 43.06 లక్షల నగదు, 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులను ఏసీబీ అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు గచ్చిబౌలి, తెల్లాపూర్‌లలో ఫ్లాట్లు, మణికొండలో నిర్మాణంలో ఉన్న వాణిజ్య సముదాయంలో వాటా, సంగారెడ్డి జిల్లాతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 45 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. అలాగే 'శ్రీ రాఘవేంద్ర రాక్ శాండ్ మినరల్స్'లో రూ. 75 లక్షల మేర పెట్టుబడులు పెట్టినట్టలు నిర్ధారించారు. తెల్లాపూర్‌లో రెండు ప్లాట్లు, ప్రగతి రిసార్ట్స్ సమీపంలో 500 గజాల ప్లాట్, నాగోల్ కామినేని ఆసుపత్రి సమీపంలో 200 గజాల ప్లాట్, పటాన్‌చెరు జీపీఆర్ హౌసింగ్ సొసైటీ పరిధిలో 400 గజాల ప్లాట్, వికారాబాద్ జిల్లా మొమిన్‌పేటలో 1,000 గజాల స్థలంతో పాటు వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 19.91 లక్షల నగదు నిల్వలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.ప్రస్తుతం పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్) విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న భీంరెడ్డిని అదుపులోకి తీసుకుని అధికారికంగా అరెస్ట్ చేసినట్లు ఏసీబీ ప్రకటించింది. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మార్కెట్ విలువ కోట్లాది రూపాయల్లో ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తుండగా, ఆస్తులు పూర్తిస్థాయి లెక్కింపు ఇంకా కొనసాగుతోంది.

# ఏపీకి నేను మేనమామను...

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌కు తాను మేనమామ లాంటి వాడినని, మేనమామ ఎప్పుడూ ఖాళీ చేతులతో రాడని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ అన్నారు. తనను మధ్యప్రదేశ్‌లో ప్రజలంతా ఆప్యాయంగా 'మామాజీ' అని పిలుస్తారని, ఇప్పుడు ఏపీ ప్రజలకు కూడా తాను మేనమామనే అయ్యానని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వరాల జల్లు కురిపిస్తూ, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందజేశారు.తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ)ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి శివరాజ్ సింగ్ చౌహన్ లాంఛనంగా ప్రారంభించారు.

# గురుకుల టెండర్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వం



తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గురుకుల టెండర్లలో అవకతవకలు, రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చోటుచేసుకున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి గన్ పార్క్ వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా నెలకొంది.ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న వ్యవహారం 'బిగ్ బాస్' షోను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పైకి పోరాటంలా కనిపిస్తున్నా, లోపల ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఈ రెండు పార్టీల అవినీతి, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' తప్పదని, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ రావడం ఖాయమని బండి సంజయ్ జోస్యం చెప్పారు.

# చమురు ధరల ఊరట..

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య వాణిజ్య చర్చల్లో సానుకూల సంకేతాలు వెలువడటంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం మన మార్కెట్లకు కలిసొచ్చింది. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడి కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఫలితంగా, సెన్సెక్స్ 579.48 పాయింట్లు లాభపడి 77,502.12 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 169.85 పాయింట్లు పెరిగి 24,175.70 వద్ద ముగిసింది.ఈనాటి ర్యాలీలో టెక్నాలజీ షేర్లు కీలక పాత్ర పోషించాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ వంటి షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్లుగా నిలిచాయి. దీంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2025 మే నెల తర్వాత ఒకే రోజులో అతిపెద్ద లాభాన్ని నమోదు చేసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.48 శాతం, స్మాల్‌క్యాప్ 1.25 శాతం మేర లాభపడ్డాయి. ఐటీతో పాటు ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ రంగాల సూచీలు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి.టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ రోజంతా స్థిరమైన కొనుగోళ్లతో 24,200 నిరోధక స్థాయి వైపు కదిలిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ స్థాయిని దాటితే కొనుగోళ్ల ట్రెండ్ మరింత బలపడి 24,400--24,450 స్థాయిల వరకు వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో, కిందవైపు 24,000 స్థాయి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని పేర్కొన్నారు. తగ్గుతున్న ఇంధన ధరలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రక్షణ సాంకేతికత, ఇంధన భద్రత వంటి కీలక రంగాల్లో భారత్–జపాన్ మధ్య కొత్త ఒప్పందాలు కుదరడం కూడా మార్కెట్ ఆశావాద దృక్పథానికి దోహదపడింది

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం...

### టీచర్లకూ మధ్యాహ్న భోజనం

**ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు మధ్యాహ్న భోజనం**

**భోజన నాణ్యత, పర్యవేక్షణ పెంచడమే లక్ష్యం**

**తెలంగాణ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం**

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు అందజేసే భోజనం నాణ్యతను పెంచడంతో పాటు, పర్యవేక్షణను మెరుగుపరిచి జవాబుదారీతనాన్ని పటిష్ఠం చేసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పీఎం-పోషణ్ (మధ్యాహ్న భోజనం) పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోంది. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా అదే భోజనాన్ని స్వీకరించడం వల్ల ఆహార పరిశుభ్రత, పోషక విలువలు మరింత మెరుగవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధ్యాయుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఫలితంగా ఈ పథకం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

## బెంగళూరు ఇస్రో కేంద్రానికి బాంబు బెదిరింపు కలకలం

**బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయానికి బాంబు బెదిరింపు**

**చైర్మన్ కార్యాలయానికి ఈమెయిల్ ద్వారా అందిన సందేశం**

**రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్, ప్రాంగణంలో క్షుణ్ణ తనిఖీలు**

**తనిఖీల్లో ఏమీ లభ్యం కాలేదని, ఉత్తుత్తిదేనని ప్రకటన**

**ఈమెయిల్ మూలాలపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రధాన కార్యాలయంలో గురువారం బాంబు బెదిరింపు కలకలం రేపింది. బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపు నకిలీదని పోలీసులు నిర్ధారించారు. దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇస్రో కేంద్రంలోని చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన ఇస్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా ప్రాంగణాన్ని ఖాళీ చేయించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు. బాంబు బెదిరింపుపై పోలీసులు కేసు నమోదు చేసి, ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఇస్రో కార్యాలయంలో కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దేశంలోని పలు కీలక సంస్థలకు ఇలాంటి నకిలీ బెదిరింపులు వస్తున్న నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. జూన్ 29న ఎన్ఐఏ, డీఆర్డీఓ వంటి సంస్థలకు బెదిరింపు ఈ-మెయిళ్లు పంపిన కేసులో ఢిల్లీ పోలీసులు ఘజియాబాద్‌కు చెందిన 36 ఏళ్ల వ్యక్తిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## వైసీపీ చేతిలో కాపులు మోసపోవద్దు: సోము వీర్రాజు

**రాజకీయ లబ్ధి కోసం వైసీపీ కాపులను వాడుకుంటోందన్న వీర్రాజు**

**కాపులకు వైసీపీలో సరైన గౌరవం దక్కడం లేదని విమర్శ**

**మంత్రి బొత్స సత్యనారాయణను కూడా పక్కన పెట్టారని ఆరోపణ**

**కాపు రిజర్వేషన్లపై జగన్ వైఖరిని తప్పుబట్టిన వీర్రాజు**

**టీడీపీ హయాంలోనే కాపులకు సముచిత స్థానం లభిస్తుందని వ్యాఖ్య**



వైసీపీ కాపు సామాజిక వర్గాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసమే వాడుకుంటోందని, వారికి సరైన గౌరవం ఇవ్వడం లేదని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విషయంలో కాపు సోదరులు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం రాజమండ్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీలో కాపు నేతలకు తీవ్ర అవమానం జరుగుతోందని, మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణను సైతం పక్కనపెట్టారని విమర్శించారు. విజయసాయి రెడ్డి మద్దతుతో బొత్స మేనల్లుడు శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కాపు రిజర్వేషన్ల విషయంలో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరిని సోము వీర్రాజు తప్పుబట్టారు. సభలు, సమావేశాల పేరుతో కాపులను రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మాత్రమే కాపులకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. .

## తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం

హైదరాబాద్: తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రిటైర్డ్, ప్రస్తుత పోలీస్ ఉన్నతాధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగించింది. 26 మందికి బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను పోలీస్ శాఖ తొలగించింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్లకూ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను పోలీస్ శాఖ తీసేసింది. పలువురు రాజకీయ నేతలు, పోలీస్ అధికారుల గన్‌మెన్ల సంఖ్య తగ్గించింది. 67 మంది ప్రముఖుల గన్‌మెన్లను తగ్గించిన పోలీస్ శాఖ.. చాలా వరకు వన్‌ప్లస్, వన్ గన్‌మెన్లకే పరిమితం చేసింది.

## మహిళా సంఘాల పనితీరుపై

# సామాజిక తనిఖీ పూర్తి

**కానుకుంట--2 గ్రామైక్య సంఘంలో 34 మహిళా సంఘాలపై రాష్ట్రంలోనే తొలి నమూనా సామాజిక తనిఖీ విజయవంతం**






**గుమ్మడిదల, జూలై 2 ( నేటి ప్రస్థానం ):** మహిళా సంఘాల పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా సంఘాల సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాలను ఎంపిక చేశారు. గౌరవ సెర్ప్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి దివ్య దేవరాజన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో నమూనా ప్రాతిపదికన సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గుమ్మడిదల మండలంలోని కానుకుంట--2 గ్రామైక్య సంఘం పరిధిలోని 34 మహిళా సంఘాలకు సామాజిక తనిఖీ నిర్వహించారు. రాష్ట్రంలోనే తొలి నమూనా సామాజిక తనిఖీగా ఈ కార్యక్రమం నిర్వహించడం విశేషం. గత నెల 25వ తేదీ నుంచి బుధవారం వరకు కొనసాగిన సామాజిక తనిఖీలో మహిళా సంఘాల నిర్వహణ, పొదుపులు, అంతర్గత రుణాలు, లెక్కల నిర్వహణ, సభ్యుల భాగస్వామ్యం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మహిళా గ్రామసభలో తనిఖీలో గుర్తించిన అంశాలను సభ్యులకు వివరించి, లోపాలను సరిదిద్దుకునేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా అంతర్గత రుణాల విషయంలో పలువురు సభ్యులు అసలు మొత్తాన్ని చెల్లించకుండా కేవలం వడ్డీ మాత్రమే చెల్లిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై సభ్యులకు పూర్తి వివరాలు తెలియజేయగా, ఇకపై కిస్తీల మొత్తాన్ని పెంచి అసలు, వడ్డీ రెండింటినీ సక్రమంగా చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తామని మహిళా సంఘ సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి గ్రామీణాభివృద్ధి శాఖ సామాజిక తనిఖీ విభాగం ఉప సంచాలకురాలు ఉషారాణి, ప్రాజెక్టు మేనేజర్ ఎం. అశోక్ కుమార్, రాష్ట్ర బృంద సభ్యుడు ఈ. వేణు, జిల్లా వనరుల వ్యక్తి కె. స్వామి, జిల్లా కార్యక్రమాల నిర్వాహకుడు జాన్ కెన్నడీ, సహాయ కార్యక్రమాల నిర్వాహకుడు నరేందర్, సమన్వయకర్త వరలక్ష్మి, గ్రామ స్థాయి సంఘ ప్రతినిధి మహేశ్వరి, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు యశోద, కార్యదర్శి పూజ, మహిళా సంఘాల సభ్యులు, సామాజిక తనిఖీ బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల పనితీరు, సభ్యుల భాగస్వామ్యం, పారదర్శక నిర్వహణను రాష్ట్ర స్థాయి గ్రామీణాభివృద్ధి శాఖ సామాజిక తనిఖీ విభాగం ఉప సంచాలకురాలు ఉషారాణి అభినందించారు.

## అనంతారం రెడ్డి సంఘానికి ఏకగ్రీవంగా నూతన కమిటీ

**అధ్యక్షుడిగా గోసుకొండ ఇంద్రసేన రెడ్డి ఎంపిక.. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం వెల్లడి**

**గుమ్మడిదల , జూలై 2 (నేటి ప్రస్థానం):** గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. సంఘ అధ్యక్షుడిగా గోసుకొండ ఇంద్రసేన రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పంగ వీరా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉట్ల యాదిరెడ్డి, కోశాధికారులుగా విప్ప శేఖర్ రెడ్డి, చింతల చంద్ర రెడ్డి, ఖజాంచీగా గోసుకొండ బాలరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, సంఘ సభ్యులు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘ అభివృద్ధి, ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం పెద్దలు, సభ్యులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



## నీట్ రీ-ఎగ్జామ్ ఫలితాలపై ఎన్‌టీఏ కీలక అప్‌డేట్

**ప్రొవిజనల్ ఆన్సర్ కీపై 10 వేల అభ్యంతరాలు**

**అభ్యంతరాల పరిశీలన తర్వాత తుది ఫలితాల ప్రకటన**

**ఎంబీబీఎస్ విద్యా సంవత్సరం ఆలస్యం కాదని ఎన్‌టీఏ స్పష్టీకరణ**

నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలను జులై 20లోపు ప్రకటిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెల్లడించింది. ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన తర్వాత జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఫలితాల విడుదల కోసం వేగంగా ప్రక్రియ కొనసాగుతోందని ఎన్‌టీఏ సీనియర్ అధికారి తెలిపారు. అయితే ఫలితాల కచ్చితమైన తేదీని ఇప్పుడే వెల్లడించలేదు. ఎంబీబీఎస్ విద్యా సంవత్సరం ఆలస్యం కాదని మాత్రం స్పష్టం చేశారు. జూన్ 25న ప్రొవిజనల్ ఆన్సర్ కీ విడుదల చేయగా, అభ్యర్థులకు జూన్ 28 వరకు అభ్యంతరాలు తెలిపే అవకాశం ఇచ్చారు. మొత్తం సుమారు 10 వేల అభ్యంతరాలు వచ్చినట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఒక్కో అభ్యంతరాన్ని విడివిడిగా పరిశీలించి, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఒక్కో ప్రశ్నకు రూ.200 ఫీజు వసూలు చేస్తారని,



అభ్యంతరం సరైందని తేలితే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని వెల్లడించారు. ఫలితాల అనంతరం 15 శాతం ఆల్ ఇండియా కోటా, ఎయిమ్స్, జిప్‌మర్, కేంద్ర, డీమ్డ్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) విడుదల చేయనుంది. రాష్ట్రాలు తమ 85 శాతం స్టేట్ కోటా కౌన్సెలింగ్‌ను విడిగా నిర్వహిస్తాయి. కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే గత ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఎంబీబీఎస్ తొలి సంవత్సరం విద్యా తరగతులు సమయానికే ప్రారంభమవుతాయని ఎన్‌టీఏ అధికారులు తెలిపారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సతీమణి ఆకస్మిక బదిలీ!



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా విభాగంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీనియర్ అధికారిణి జి. లక్ష్మీబాయిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను ప్రస్తుత బాధ్యతల నుండి బదిలీ చేస్తూ, హౌసింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న ఐఏఎస్,ఇతర ఉన్నతాధికారుల బదిలీల పరంపరలో భాగంగానే ఈ కీలక స్థానచలనం జరిగినట్లు సచివాలయ అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే, ఈ బదిలీ వ్యవహారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బదిలీ అయిన అధికారిణి లక్ష్మీబాయి, మాజీ ఐపీఎస్ అధికారి బీఆర్ఎస్ కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సతీమణి కావడం దీనికి ప్రధాన కారణం.

## ప్రకాశ్ రాజ్‌ను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి: బీజేపీ నేత

**ప్రకాశ్ రాజ్ తీరు సిగ్గుచేటని విష్ణువర్ధన్ రెడ్డి విమర్శ**

నటుడు ప్రకాశ్ రాజ్‌ను సినీ పరిశ్రమ నుంచి బహిష్కరించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు ఆధ్యాత్మిక గురువులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఓ యూట్యూబర్‌కు ప్రకాశ్ రాజ్ మద్దతు తెలపడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన రావణ్ అనే యూట్యూబర్‌ను అనుచిత వ్యాఖ్యల కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టును తప్పుబడుతూ ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఇలా అరెస్టులు చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.



# సామాజిక అసమానతల సర్కారు బాయి

తెలంగాణ నేపథ్యంలో సామాజికాంశాల్ని చర్చిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'సర్కారు బాయి'. శ్రీరామ్ నిమ్మల, వర్షిక జంటగా నటిస్తున్నారు. లారా దర్శకుడు. తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'చరిత్రలో మరుగున పడిపోయిన ఓ కథను తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. 1985లో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్న ఈ చిత్రంలో కులవివక్ష, సామాజిక అసమానతలు, అణగారిన వర్గాలపై అన్యాయాల గురించి చర్చించబోతున్నాం' అన్నారు. సమాజానికి సందేశాన్నందించే చిత్రమిదని నిర్మాత తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి పేర్కొన్నారు. బాహుబలి ప్రభాకర్, వివ రెడ్డి, నాగ మహేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కె.శివా, దర్శకుడు: లారా.

# అదే పెద్ద చాలెంజ్!

ప్రస్తుతం పూజాహెగ్డే దక్షిణాది చిత్రసీమపైనే పూర్తిగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా తెలుగులో పూర్వ వైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇండస్ట్రీ పరిస్థితులపై ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ప్రస్తుతం థియేట్రికల్ సినిమా చాలా ఇబ్బందుల్లో ఉందని, విడుదలైన వెంటనే కంటెంట్ ఎలాంటిదో ప్రేక్షకులు ఓ నిర్ణయానికి వస్తున్నారని, ఫేక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వారిని మభ్యపెట్టడం సాధ్యం కాదని చెప్పింది. నేడు వినోదానికి అనేక వేదికలు అందుబాటులో ఉన్నాయని, ప్రేక్షకులు థియేటర్‌కు రావాలంటే కథలో బలమైన ఉద్వేగాలు ఉండాలని అభిప్రాయపడింది.తెలుగు వార్తలుకమర్షియల్ సినిమాల్లో నటించడం చాలా సులభమని అనుకుంటారని, కానీ వాటిలోనే ఎన్నో సవాళు ్లంటాయని పూజా హెగ్డే చెప్పింది. 'మంచి కథలో అభినయంపై దృష్టిపెడితే సరిపోతుంది. కానీ కమర్షియల్ సినిమా అలా కాదు. గ్లామర్‌తో పాటు డ్యాన్స్, ఎమోషన్స్..ఇలా అన్ని అంశాల్లో సమతుల్యం పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి. అన్నింటికంటే కమర్షియల్ సినిమానే పెద్ద చాలెంజ్' అని పూజాహెగ్డే చెప్పింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే నాయికగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.



# దసరా బరిలో కింగ్ 100? అగ్ర నటుడు నాగార్జున



అగ్ర నటుడు నాగార్జున ప్రస్తుతం తన వందో చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు 'కింగ్100' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా షూటింగ్‌ను కంప్లీట్ చేసి పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను మొదలుపెడతారని సమాచారం. ఓ సామాన్యుడు అసాధారణ శక్తిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరించే కథాంశమిదని, ఇందులో నాగార్జున విభిన్న కాలాల్లో, డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని అంటున్నారు. ఏఐ సాంకేతికతతో నాగార్జున రెట్రోలుక్స్‌ని రీక్రియేట్ చేయబోతున్నారని తెలిసింది. ఆయన లుక్స్‌తో పాటు క్యారెక్టర్ ప్రజెంటేషన్ సరికొత్తగా ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని దసరా బరిలో దించేందుకు నాగార్జున సన్నాహాలు చేస్తున్నారట. టబు కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని నాగార్జున స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు.

# విడాకుల దిశగా శుభ పూంజా దంపతులు

కన్నడ సినీ రంగానికి చెందిన ప్రముఖ నటి, బిగ్‌బాస్ మాజీ పోటీదారు శుభ పూంజా వైవాహిక జీవితం ముగింపు దశకు చేరుకుంది. దంపతులు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. నాలుగేళ్ల క్రితం నటి శుభ పూంజా, ఆమె భర్త సుమంత్ బిల్లవ పరస్పరం అంగీకరించుకొని విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టుకు వెళ్లారు. కన్నడ పర పోరాటదారుడు, వ్యాపారి ఉడుపికి చెందిన సుమంత్ బిల్లవ, నటి శుభ పూంజా ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. 2022 జనవరి 5న శుభ పూంజా తన సొంతూరులో సరళంగా దాంపత్య జీవితంలోకి అడుగు పెట్టారు. ఇద్దరి అంగీకారం మేరకు ఫ్యామిలీ కోర్టులో అర్జీ వేశారు. వచ్చే వాయిదా రోజున ఇద్దరు కోర్టుకు వెళ్లి జడ్జి ముందు హాజరై విడాకులు తీసుకోవాలని నిర్ణయించారు.





# కొత్త సినిమా సన్నాహాల్లో..

అగ్ర హీరో వెంకటేష్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శకుటుంబం' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దీని తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో కల్యాణ్‌రామ్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని చేయబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఆయన మరో చిత్రానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. 'విశ్వంభర' దర్శకుడు వశిష్టతో ఓ చిత్రానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. స్టోరీ లైన్ నచ్చడంతో వెంకటేష్ ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకరించారని, ఫుల్ నరేషన్ అయిన తర్వాత సినిమాపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

# ఆ వార్తల్లో నిజం లేదు!



కన్నడ అగ్ర హీరో యష్ నటించిన పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్' రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇది గ్యాంగ్‌స్టర్ డ్రామా అయినప్పటికీ.. మనోవిశ్లేషణతో కూడిన కథాంశమని, డార్క్ క్యారెక్టర్‌ను దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ పాజిటివ్‌గా ఆవిష్కరించారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో యష్ తెలిపారు. దీంతో గ్యాంగ్‌స్టర్, సైకలాజికల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారని తెలుస్తున్నది. తాజాగా ఈ సినిమాను రీషూట్ చేస్తున్నారని, ఫైనల్ అవుట్‌పుట్‌పై యష్ సంతృప్తిగా లేరని, అందుకే రిలీజ్ డేట్ పలుమార్లు వాయిదా పడిందని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. వీటిపై చిత్రబృందం స్పందించింది. ఇవన్నీ పుకార్లని, నిర్మాణానంతర కార్యక్రమాలను పూర్తి చేసుకొని ప్రస్తుతం ప్రమోషనల్ ఈవెంట్స్‌పై దృష్టి పెట్టామని స్పష్టం చేసింది. ఈ సినిమాను ఇంగ్లీష్ భాషలో కూడా రిలీజ్ చేస్తుండటంతో హీరో యష్ విదేశీ ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ సినిమా ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకురానుందని సమాచారం. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా తదితరులు ప్రధాన పాత్రల్ని పోషించారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/